రైతుకు ధీమా పంటకు బీమా





- క్రాప్ ఇన్సూరెన్స్ అమలుకు ప్రభుత్వం కసరత్తు
- గ్రామం యూనిట్‌గా వివరాల సేకరణ
- త్వరలోనే మార్గదర్శకాలు విడుదల

జనగామ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పంటల బీమాకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో పంటల బీమాను అమలు చేసి రైతులకు ఆర్థిక భరోసా ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం బీమా ప్రక్రియను వేగవంతం చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కొంత నెమ్మదించగా ప్రస్తుతం వేగం పుంజుకుంది. కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద పంటలకు బీమా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను తయారు చేసే పనిలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరలేదు. దీంతో రాష్ట్రంలోని రైతులకు పంటలు నష్టపోయిన సందర్భంలో ఎలాంటి పరిహారం అందలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫసల్ బీమా యోజనలో చేరాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆయా జిల్లాలో గ్రామాలు, మండలాల వారీగా సాగయ్యే పంటలు, వాతావరణ పరిస్థితులపై వివరాలను ప్రభుత్వం సేకరించింది.

గ్రామం యూనిట్‌గా బీమా

పంటల బీమాను గ్రామం, మండలం యూనిట్‌గా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒక గ్రామంలో ఎక్కువగా ఏ పంట సాగవుతోంది.. ఎంత విస్తీర్ణం.. వాతావరణ పరిస్థితులు.. ఇలా పలు అంశాలపై జిల్లా అధికారుల నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వివరాలు తీసుకున్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోయినా.. చీడపీడల కారణంగా దిగుబడి తగ్గినా గ్రామం యూనిట్‌గా తీసుకొని పరిహారం అందించేందుకు ప్రభుత్వం విధివిధానాలను తయారు చేస్తోంది. అదే విధంగా మండలాల వారీగా యూనిట్‌గా తీసుకొని బీమా చేయడంపై కూడా ఆలోచన చేస్తోంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2016లో తీసుకువచ్చింది. ఈ పథకంలో దేశంలోని అన్ని రాష్ట్రాలు అమలు చేయగా తెలంగాణ ప్రభుత్వం మాత్రం చేరలేదు. దీంతో అప్పటి నుంచి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయినప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. గత ప్రభుత్వం ఈపథకంలో చేరినట్లయితే రైతులకు పంట నష్ట పరిహారం అంది ఉండేది.

ఉచితంగా బీమా

పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం సొమ్మును ప్రభుత్వమే చెల్లించనుంది. ఫసల్ బీమా యోజనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాతో పాటు రైతు కూడా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. కానీ.. రైతు ప్రీమియంను కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనుంది. పంటల బీమాకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల కాగానే ఆసక్తి ఉన్న ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి బిడ్డింగ్‌లను ప్రభుత్వం ఆహ్వానిస్తుంది. బిడ్డింగ్ దక్కించుకున్న కంపెనీకి రైతులు, వారు సాగు చేసిన పంటల వారీగా బీమా ప్రీమియం సొమ్మును చెల్లిస్తుంది. ఏడాదికి వానాకాలం, యాసంగి రెండు సీజన్లలోనూ పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించనుంది. ఫసల్ బీమా యోజన కింద ఆయా ప్రాంతాలను బట్టి హెకార్టుకు రూ. 35 నుంచి రూ.70 వేల మొత్తానికి కేంద్ర ప్రభుత్వం బీమా చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వమూ ఇదే విధానాన్ని అమలు చేయనుంది. రైతు వాటా కింద రూ. 1000 నుంచి రూ.1600 వరకు ఉంటుంది. బీమా మొత్తంలో వానాకాలం పంటలకు 2 శాతం, యాసంగి పంటలకు 1.5 శాతం, ఏడాది కాలపరిమితి ఉన్న వాణిజ్య పంటలకు 5 శాతం ప్రీమియాన్ని రైతు చెల్లించాల్సి ఉండగా దీనిని ప్రభుత్వమే చెల్లించనుంది.

జిల్లాలో 171 యూనిట్ల గుర్తింపు

పంటల బీమాకు సంబంధించి జిల్లాలో 171 యూనిట్లను గుర్తించారు. 250 ఎకరాలకు పైబడి వరి పండించే గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకున్నారు. అదే విధంగా 250 ఎకరాల లోపు వరి విస్తీర్ణం ఉన్న 2 నుంచి ఐదు గ్రామాలను(మొత్తంగా 250 ఎకరాల విస్తీర్ణం) కలిపి ఒక యూనిట్‌గా తీసుకున్నారు. 250 ఎకరాల పై బడిన యూనిట్లు 158 ఉండగా, 250 ఎక రాల లోపు ఉన్న గ్రామాల యూనిట్లు 9 ఉన్నాయి. దీంతో పాటు జిల్లా మొత్తంగా పత్తి పంటను ఒక యూనిట్‌గా, కంది పంటను 3 యూనిట్లుగా తీసుకు న్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో వరి, మొక్కజొన్న, కంది, మామిడి, పత్తి, మిర్చి తదితర అన్ని రకాల పం టలను కలిపి 668 ప్రాంతాల్లో పంట వేసిన నాటి నుంచి కోత అయ్యే వరకు వివిధ దశల్లో పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేస్తారు. నిర్ణీత విస్తీర్ణంలో ఎంత దిగుబడి రావాల్సి ఉంది? ఎంత వచ్చిందనే వి వరాలను నమోదు చేసుకుంటారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యాల వల్ల , చీడపీడల వల్ల దిగుబడులు తగ్గినట్లయితే బీమా నిబంధనల ప్రకారం పరిహారం చెల్లిస్తారు.

సాగు వివరాలు పంపించాం..

- వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



పంటల బీమాకు సంబంధించి జిల్లాలో గ్రామాల వారీగా ఏయే పంటలు సాగవుతాయనే వివరాలను ఉన్నతాధికారులు అడిగారు. దీనిపై ప్రణాళికశాఖతో కలిసి ఉమ్మడి నివేదికను పంపించాం. బీమాకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రక్రియ చేపడతాం.

అనుమతి లేకుండా చొరబడడం నేరం

డబుల్ ఇళ్ల ఆక్రమణదారులకు అధికారుల కౌన్సెలింగ్



కామారెడ్డిగూడెంలో డబుల్ ఇళ్ల ఆక్రమణదారులతో మాట్లాడుతున్న అధికారులు

దేవరుప్పుల, జూన్ 10: అనుమతులు లేకుండా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి చొరబడడం నేరమని చొరబాటుదారులను అధికారులు హెచ్చరించారు. దేవరుప్పుల మండలం ధర్మాపురం, కామారెడ్డిగూడెం, కడవెండి గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గత ప్రభుత్వం నిర్మించింది. ఇడ్లు పూర్తి అయినప్పటికీ నిరుపేదలకు కేటాయింపులు జరుపలేదు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మారినందున కాంగ్రెస్ ప్రభుత్వమైనా కేటాయింపులు జరుపుతుందేమోనని నిరీక్షించిన ప్రజలకు ఓపిక నశించింది. రెండురోజుల క్రితం కొంత మంది ఆ ఇళ్లలోకి చొరబడి ఆక్రమించుకున్నారు. దీంతో సోమవారం సాయంత్రం తహసీల్దార్ హస్సేన్, డీటీ నవీన్‌కుమార్, పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు, హౌసింగ్ ఏఈ ఇరమేష్ అక్కడికి వెళ్లి ఆక్రమణదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇండ్ల నిర్మాణం పూర్తి కాలేదని, ఎలాంటి అనుమతులు లేకుండా చొరబడటం చట్ట విరుద్ధమని, గ్రామ సభల్లో లబ్ధిదారులను ఎంపిక చేశాక మంజూరు చేస్తారని వివరించారు. వెంటనే ఇండ్లు ఖాళీ చేయాలని ఆదేశించారు.

ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురికి తీవ్ర గాయాలు





ప్రమాదంలో గాయపడిన రాకేష్, విష్ణు

ములుగు, జూన్ 10: ములుగు మండలం ఇంచర్ల సమీపంలో సోమవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తాప డిన సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెం కటాపూర్(రామప్ప) మండల కేంద్రం నుంచి సిమెంటు దిమ్మెల లోడుతో ట్రాక్టర్ ములుగు మండలం దేవగి రిపట్నం వైపు వస్తున్న క్రమంలో ఈప్రరమాదం జరిగిం ది. ట్రాక్టర్ ట్రాలీ అదుపుతప్పి బోల్తాపడగా వెంకటా పూర్ మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ మేకల అజయ్ స్వల్పంగా గాయపడ్డాడు. కూలీలు నార్లగిరి రాకేష్, మేక ల విష్ణుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహకా రంతో పోలీసులు క్షతగాత్రులను ఆటోలో ములుగు ప్రభు త్వ ఆస్పత్రికి తరలించారు. రాకేష్, విష్ణు పరిస్థితి ఆందోళ నకరంగా ఉండగా మెరుగైన చికిత్స కోసం వారిని వరంగ ల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదం జరిగిన ప్రదేశం ములుగు-వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ల సరిహద్దు మధ్యలో ఉండడంతో కేసు ఎవరి పరిధిలోకి వస్తుందో తేలాల్సి ఉంది.

ఎయిర్‌ఫోర్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, జూన్ 10: అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ వాయు ఉద్యోగాల ఎంపిక పరీక్ష కోసం అవివాహిత పురుషులు, మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8 నుంచి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో పరీక్షలు అక్టోబరు 18 నుంచి ప్రారంభమవుతాయన్నారు. గుర్తింపు పొందిన విద్యా బోర్డుల నుంచి గణితం, ఫిజిక్స్, ఇంగ్లీషుతో ఇంటర్మీడియట్ తత్సమాన పరీక్షలో కనీసం 50శాతం, ఆంగ్లంలో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు అగ్నిపథ్‌వాడు డాట్ సిడాక్ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్ పాయిజన్

కలుషిత ఆహారం తిని చిన్నారికి అస్వస్థత

సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీడీపీవో



మల్కపేటలో చిన్నారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న సీడీపీవో రమాదేవి

నర్మెట, జూన్ 10: అంగన్‌వాడి కేంద్రంలో ఇచ్చిన కోడిగుడ్డు, స్నాక్స్ తిన్న నాలుగేళ్ల చిన్నారికి ఫుడ్‌పాయిజన్ అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనగామ జిల్లా నర్మెట మండలం మల్కాపేట గ్రామంలోని అంగన్‌వాడి సెంటర్ 1కు గత శుక్రవారం బానోతు అశోక్ కూతురు ఆధ్యాశ్రీ వెళ్లింది. వారు ఇచ్చిన ఉడకబెట్టిన కోడిగుడ్డు, కురుకురేలు తిన్నది. కొద్ది సేపటికి వాంతులు చేసుకోవడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి ఫుడ్ పాయిజన్ అయిందని తెలిపారు. దీంతో అంగన్‌వాడి సెంటర్‌కు వెళ్లి గుడ్లను పగులగొట్టి చూడగా కుళ్లిపోయి దుర్వాసన వచ్చాయి. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి సోమవారం అంగన్‌వాడి సెంటర్‌లను తనిఖీ చేశారు. కుళ్లిపోయిన కోడిగుడ్లను, గడువు ముగిసిన కురుకురే(స్నాక్స్) లను గుర్తించారు. చిన్నారులకు ఇలాంటి ఆహార పదార్థాలు ఎందుకిచ్చారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా అంగన్‌వాడి సెంటర్ 2ను పరిశీలించగా సంబంధిత టీచర్ అందుబాటులో లేదు. ఇద్దరిపై విచారణ జరిపి మెమోలు జారీ చేస్తామని అన్నారు.





కుళ్లిపోయిన కోడిగుడ్డు, కాలం చెల్లిన స్నాక్స్ బ్యాగ్

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



ప్రజావాణిలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

జనగామ కల్చరల్, జూన్ 10: ప్రజావాణిలో వివిధ సమస్యలతో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేశ్‌కుమార్‌తో కలిసి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. 21 ఆర్జీలు రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు రిఫర్ చేశారు. పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించేందుకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

- స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్‌కు చెందిన సింగపురం రాజు తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరిట రికార్డులలో నమోదు చేయాలని దరఖాస్తు చేసుకున్నాడు.
- జాఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లు గ్రామానికి చెందిన వెన్న కళావతి తన 120 గజాల ఇంటి స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో న్యాయం చేయాలని కోరారు.
- తమ కుమారులు, కుమార్తెలు సరిగా చూసుకోకుండా తన భూమిని రాసివ్వాలంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, సమస్య పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని కుర్మవాడకు చెందిన సాదన భూలక్ష్మి వినతిపత్రం సమర్పించారు.
- రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన రైతులు తమ భూమికి హద్దులు నిర్ణయించాలని దరఖాస్తు ఇచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఈఓ కె.రాము, డీఎస్ వో రోజారాణి, డీడబ్ల్యూవో జయంతి, డీఏవో వినోద్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాకు భూమి లేదంటున్నారు..

- బండిపెల్లి రామచంద్రయ్య, లక్ష్మీనారాయణపురం, పాలకుర్తి మం.



వినతిపత్రం చూపుతున్న రామచంద్రయ్య

పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామంలో స.నం.125/3లో నాకు 20 గుంటల భూమి ఉంది. ఆ భూమిని పక్కన ఉన్న గిలకత్తుల శంకరయ్య, గిలకత్తుల సుధాకర్ అనే వ్యక్తులు కబ్జా చేస్తున్నారు. తనకు భూమి లేదని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వారి నుంచి రక్షణ కల్పించి నా భూమిని నాకు ఇప్పించాలి.

దేవరుప్పుల వాగు నుంచి ఇసుకను తరలించొద్దు



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దేవరుప్పుల బీఆర్ఎస్ నాయకులు, రైతులు

దేవరుప్పుల మండలం చిన్నమడూరు, పెద్దమడూరు, కడవెండి పరిధిలో వాగు నుంచి ఇసుక తరలింపును నిలిపివేయాలని ఆయా గ్రామాల రైతులు ప్రజావాణిలో కలెక్టర్‌ను కోరారు. చెన్నూరు రిజర్వాయర్ నిర్మాణానికి ఇక్కడి ఇసుకను తరలించేందుకు ఎలా అనుమతులిస్తారంటూ కలెక్టర్ రిజ్వాన్ బాషాను, మైనింగ్ అధికారులను నిలదీశారు. అనుమతుల పేరుతో కాంట్రాక్టర్లు జేసీబీలతో విచ్చలవిడిగా ఇసుకను తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇసుక రవాణా అనుమతులను వెంటనే నిలిపివేయాలని కోరారు. దీంతో ఇసుక తరలింపును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ విషయంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్‌డీవో కొమురయ్య, వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలవనరుల శాఖ, గనుల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని, వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు.

టెస్కాబ్ చైర్మన్‌గా మార్నేని

హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో ఏకగ్రీవ ఎన్నిక

నియామకపత్రాన్ని అందుకున్న రవీందర్‌రావు

గత చైర్మన్ కొండూరు రాజీనామాతో అవకాశం

ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధికి తొలిసారి దక్కిన పదవి



టెస్కాబ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మార్నేని రవీందర్‌రావును సత్కరిస్తున్న పలు డీసీసీబీల చైర్మన్లు

హనుమకొండ సిటీ, జూన్ 10 : తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు నియమితులవగా.. వైస్ చైర్మన్‌గా హైదరాబాద్ డీసీసీ బ్యాంక్ చైర్మన్ కొత్తకుర్మ సత్తెయ్య ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్ అబిడ్స్‌లోని టెస్కాబ్ ప్రధాన కార్యాలయంలో సీసీ అండ్ ఆర్‌సీఎస్ కమిషనర్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవంగా ముగిసింది. ఎన్నిక పూర్తయిన తరువాత ఐఏఎస్ అధికారి, రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ హరిత నుంచి రవీందర్‌రావు నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు పలువురిని మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్ ఉమ్మడి జిల్లా చరిత్రలోనే ఇక్కడి డీసీసీ బ్యాంక్ చైర్మన్ టెస్కాబ్ చైర్మన్‌గా నియమితులు కావడం ఇదే తొలిసారి. మార్నేని ఈ రికార్డును సొంతం చేసుకున్నారు. ఇదిలా ఉంటే రవీందర్‌రావు అనుచరులు, వర్ధన్నపేట నియోజకవర్గంలో సంబురాలు నెలకొన్నాయి.

కొండూరు రవీందర్‌రావు రాజీనామాతో ఏర్పడిన ఖాళీ

బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో రాష్ట్రంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. వీటిలో ఒకటి టెస్కాబ్ చైర్మన్ పోస్టు. రాష్ట్రంలో మొత్తం 9 డీసీసీ బ్యాంకులున్నాయి. చైర్మన్లుగా ఉన్న వారిలో ఏడుగురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. టెస్కాబ్ చైర్మన్‌గా ఉన్న కొండూరు రవీందర్‌రావుతో పాటు వైస్ చైర్మన్‌గా ఉన్న నల్గొండ డీసీసీ బ్యాంక్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడలేదు. ప్రస్తుత రాజకీయ పరిణామాలతో చైర్మన్‌గా ఉన్న కొండూరు రవీందర్‌రావుపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం కాగా.. పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఆయన స్వచ్ఛందంగా టెస్కాబ్ చైర్మన్ పదవికి రాజీనామా చేయగా ఆయనతో పాటు వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి కూడా రాజీనామా చేశారు. ఈ క్రమంలో టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్ పోస్టులకు ఎన్నిక అనివార్యమైంది. అయితే చైర్మన్ రవీందర్‌రావుపై సోమవారం అవిశ్వాస తీర్మానం జరగాల్సి ఉండగా అంతకు ముందే రవీందర్‌రావు రాజీనామా చేయడంతో సభ్యులుఈ సమావేశంలో మార్నేని రవీందర్‌రావు చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక ప్రక్రియకు గత చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, వైఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి గైర్హాజరయ్యారు. ఇక వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేనితో పాటు మిగిలిన ఆరు చైర్మన్లు హాజరై.. వారంతా మార్నేనికి మద్దతు తెలపడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. అయితే అంతకు ముందు పలువురు డీసీసీబీ చైర్మన్లు ఈ చైర్మన్ పదవి కోసం పావులు కదిపారు. కానీ చివరకు మార్నేని రవీందర్‌రావును చైర్మన్ పదవి వరించింది.

జిల్లాకు తొలిసారిగా దక్కిన రాష్ట్ర చైర్మన్...

వరంగల్ జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్‌గా గతంలో బాధ్యతలు చేపట్టిన వారిలో ఎవరూ టెస్కాబ్ చైర్మన్‌గా నియమితులు కాలేదని బ్యాంక్ వర్గాలు చెబుతున్నాయి. మార్నేని చైర్మన్‌గా నియమితులవడంతో జిల్లా నుంచి ఈ చైర్మన్ పదవిని పొందిన తొలి ప్రజాప్రతినిధిగా మార్నేని గుర్తింపు పొందారు. మార్నేని నియామకంతో వర్ధన్నపేట నియోజకవర్గం, ఆయన వర్గీయుల్లో ముఖ్యంగా ఆయన స్వగ్రామం ఐనవోలులో సంబురాలు చోటు చేసుకున్నాయి.

పెద్దచెరువు కట్టకు పొంచి ఉన్న ప్రమాదం

కూలిన రాతి గోడ

వరద పెరిగితే కట్ట కొట్టుకుపోయే ప్రమాదం


వేలుబెల్లిలో కూలిన పెద్ద చెరువు కట్ట రాతి గోడ

కొత్తగూడ, జూన్ 10 : కాకతీయుల కాలం నాటి పెద్ద చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉంది. చెరువు కట్టకు రక్షణగా ఉన్న రాతి గోడ కూలిపోయింది. శిథిలావస్థలో చెరువు తూము ఉంది. మండలంలోని వేలుబెల్లి గ్రామంలో నాడు కాకతీయులు పాలించే కాలంలో పెద్ద చెరువు తవ్వించారు. సుమారు 30 సంవత్సరాల క్రితం చెరువు కట్టకు బుంగలు పడి నీరు వృథాగా పోతుండగా రైతులు బుంగలు పూడ్చివేసి కట్టకు రక్షణగా రాతి గోడ నిర్మించారు. కాని, నేడు ఆ రాతి గోడ కూలిపోయింది. వర్షాలకు వచ్చిన వరద నీరుతో చెరువు నిండితే కట్టకు బుంగలు పడే ప్రమాదం ఉందని, బుంగలు పడితే చెరువు కట్ట కొట్టుకుపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు కట్ట తెగితే నీరు వృథాగా పోయి పంటలకు నీరు లేక తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. చెరువుకు ఉన్న తూము సైతం శిథిలావస్థకు చేరుకుందని, కాలువలు పూడుకు పోయాయని రైతులు ఆయోమయానికి గురవుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే చెరువు కట్టకు, తూములకు మరమ్మత్తు పనులు చేపట్టాలని సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి సురేందర్, రైతులు కోరుతున్నారు. పెద్ద చెరువుకు ప్రమాదం పొంచి ఉందని గత సవంత్సరం మే నెలలో 'పెద్ద చెరువుకు పెద్ద గండం' అనే కథనంను ప్రచురించాము. అయిన నాటి నుంచి నేటి వరకు చెరువు కట్టకు, తూముకు మరమ్మత్తులు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువు కట్ట కొట్టుకుపోయిన తర్వాతే అధికారులు స్పందిస్తారేమోనని రైతులు విమర్శిస్తున్నారు.

జూలై 1 నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 10 : కేయూ పరిధిలో పీజీ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు జూలై 1 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు జూలై 1 నుంచి 12 వరకు కొనసాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై చర్యలు చేపట్టాలి

టెలీకాన్ఫరెన్స్‌లో టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 10 : విద్యుత్ ప్రమాదాలు తగ్గించడానికి క్షేత్ర స్థాయిలో భద్రత చర్యలు చేపట్టాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల 16 సర్కిళ్ల టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్లు, టెక్నికల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లతో సోమవారం సీఎండీ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. తరుచుగా జరిగే విద్యుత్ ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని, భద్రతపై నిర్లక్ష్యం, అవగాహన లోపంతో నాసిరకం విద్యుత్ పరికరాల వినియోగంతో వినియోగదారులు తరుచుగా ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రమాదాల నివారణకు సర్కిళ్ల వారీగా టెక్నికల్ డివిజన్ ఇంజనీర్లు నోడల్ సేఫ్టీ అధికారులుగా వ్యవహరించి వినియోగదారులు, సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు, రైతులకు, టీజీ ఎన్పీడీసీఎల్ సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించి వాటిని పూర్తిస్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు కిందిస్థాయి సిబ్బంది నుంచి సీనియర్ అధికారుల వరకు అందరి కృషి అవసరమన్నారు. ఎన్పీడీసీఎల్‌ను జీరో విద్యుత్ ప్రమాదాల సంస్థ తీర్చిదిద్దేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని, అందుకు ప్రతీ ఒక్క సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలన్నారు.

గన్నీబ్యాగుల ధర రూ.60కు పెంచాలి

మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్‌కు రైతు సంఘం వినతి



మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయికి వినతి ప్రత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు మోర్తాల చందర్‌రావు

వరంగల్ వ్యవసాయం, జూన్ 10: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో రైతుల గన్నీబ్యాగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.30 నుంచి రూ.60లకు పెంచాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు సోమవారం హైదరాబాద్‌లో మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయికి వినతిపత్రం అందజేశారు. చందర్‌రావు పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఏడేళ్లుగా గన్నీబ్యాగుల ధరలు పెంచలేదని, ప్రస్తుతం చెల్లించే రూ.30 సైతం నిబంధనల మేరకు వ్యాపారులు చెల్లించడం లేదని పేర్కొన్నారు. రైతులకు వ్యాపారులు చెల్లించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు అదే రైతులు చెల్లించే దడువాయి, హమాలీ, గుల్లవాల, చాటవాల చార్జీలను మాత్రం క్రమం తప్పకుండా రెండేళ్లకు ఒకసారి పెంచుతూ పోతున్నారని వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కూస సంపత్‌కుమార్, బల్లుకురి నర్సయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



నెహ్రూ సెంటర్, జూన్ 10 : మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఇన్‌చార్జ్ ఎస్సై బాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో కిలోమీటరు రాయి 435/13 వద్ద సుమారు 45ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని మహిళ రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆమె మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు.

విత్తన ఎంపికే కీలకం



షాపుల్లో సిద్ధంగా ఉంచిన పురుగు మందులు

- ప్రకటనలు చూసి మోసపోవద్దు
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- నాణ్యమైన విత్తనాలనే కొనాలి
- రశీదులు భద్రపరుచుకోవాలి
- నేల స్వభావం మేరకు ఎరువులు వాడాలి
- సూచిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

బచ్చన్నపేట/నర్మెట, జూన్ 10: రైతులు వానాకాలం సాగును ప్రారంభించారు. రోహిణి కార్తెలో కొంత మంది నార్లు పోయగా, మరికొంత మంది వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా వరితో పాటు పత్తి, మొక్కజొన్న, కంది పంటలు పెద్ద ఎత్తున సాగు చేసే అవకాశం ఉంది. వర్షాలు సైతం అనుకూలంగా కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ముందస్తు సంకేతాలు ఇస్తుండటంతో సాగుకు అనుకూలంగా ఉన్న భూములను వదిలి పెట్టకూడదని రైతులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లో విత్తన, పురుగు మందుల కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి విస్తృత ప్రచారం చేస్తూ రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గ్రామాల్లో టెంట్లు వేసి రైతులను సమీకరించి భోజనాలు ఏర్పాటు చేసి మరీ ప్రచారం చేస్తున్నాయి. తమ కంపెనీ విత్తనాలు అధిక దిగుబడులు ఇస్తాయని, పంటచేనుకు ఎలాంటి తెగుళ్లు రావని ఊదరగొడుతున్నాయి. అధికారులు ఎంత తనిఖీలు చేసినా మార్కెట్లోకి నకిలీ విత్తనాలు, పురుగు మందులు వస్తూనే ఉన్నాయి. అయితే పంట దిగుబడి అధికంగా రావాలంటే నాణ్యమైన విత్తనాలు అవసరం. ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా లేకపోతే శ్రమ, పెట్టుబడి కోల్పోక తప్పదు.

పురుగు మందుల కొనుగోళ్లలో జాగ్రత్తలు..

పురుగు మందుల మోతాదు ఎక్కువైతే నష్టపోయేది రైతే. వ్యవశాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని వాడాలని అధికారులు సూచిస్తున్నారు. పురుగు మందు డబ్బాలపై వాటి స్థాయిని తెలిపే విధంగా డైమాండ్ ఆకారంలో ఎరుపు, నీలం, ఆకుపచ్చ రంగులు ముద్రించి ఉంటాయి. వాటి గురించి సమగ్రంగా తెలుసుకుని వాడటం మంచిదని అంటున్నారు. వివిధ రకాల పురుగు మందుల డబ్బాల్లో మందు మిగిలితే అన్నింటిని కలిపి కొట్టడం ప్రమాదకరం. ఇలా చేసి అనేక మంది తమ పంటలను కోల్పోయిన వారు ఉన్నారు. కొనుగోలు చేసే సమయంలో రశీదు తీసుకోవటంతో పాటు, డీలర్ రిజిస్టర్ బుక్‌లో సంతకం చేస్తే, నకిలీ పురుగుమందుల వల్ల నష్టపోతే ప్రశ్నించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఎరువుల విషయంలోనూ ఇలాంటి జాగ్రత్తలే తీసుకోవాలని, ఆధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేసి బిల్లులు భద్రపర్చాలని సూచిస్తున్నారు.

విత్తన కొనుగోళ్లపై నిర్లక్ష్యం తగదు..

నాసిరకం విత్తనాలు వాడితే విరివిగా తెగుళ్లు సోకుతాయని, పంట దిగుబడి తక్కువగా వస్తుందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలంటున్నారు. విడి విత్తనాల జోలికి వెళ్లవద్దంటున్నారు. తీసుకునే బిల్లుపై విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబరు, రకం పేరు, బ్యాచ్ నంబరు గడువు తేదీలు పరిశీలించి తీసుకోవాలంటున్నారు.

నేల స్వభావాన్ని బట్టి ఎరువులు వాడాలి..

నేల స్వభావాన్ని బట్టి పంట ఎదుగుదల, చీడపీడల ఉధృతి ఉంటుంది. అందువల్ల భూమి పోషక విలువలను బట్టి ఎరువులు, పురుగు మందులు వాడడం ఉత్తమం. ఒకరిని చూసి మరొకరు ఒకే రకం పంటలు, విత్తనాలు వేయకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాల మేరకు వాడడం మంచిదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.



నారు పోయడానికి సిద్ధం చేసిన పొలం



డ్రిప్ ఆధారంగా సాగు చేసిన పత్తి

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి...

- వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖాధికారి



విత్తనాల కొనుగోలులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. లూజు విత్తనాలను కొనుగోలు చేయవద్దు. నకిలీ విత్తనాలు అని అనుమానం వస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలి. సేంద్రియ పద్ధతుల ద్వారా సాగు చేయాలి. మార్కెట్‌లోకి నకిలి విత్తనాలు, పురుగు మందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగే విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నాం. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై రైతులకు అనుమానం వస్తే వెంటనే ఏఈవోలకు, ఏవోకు, అవసరమైతే నాకు సమాచారం అందించాలి. రైతాంగానికి అన్యాయం జరగకుండా ఎప్పటికప్పుడు నిఘా కొనసాగిస్తాం.

చేతన ఫౌండేషన్‌కు 'ఆటా' అవార్డు



అమెరికాలోని అట్లాంటా నగరంలో అవార్డు అందుకుంటున్న వెనిగళ్ల రవికుమార్

భారత్ సహా పలు దేశాల్లో సేవా కార్యక్రమాలు

బయ్యారం, జూన్ 10 : భారత్, అమెరికా సహా ఏడు దేశాల్లో వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతున్న చేతన గ్లోబల్ ఫౌండేషన్‌కు విశ్వనగరం వేదికగా అరుదైన అవార్డు లభించింది. అమెరికాలోని అట్లాంటా నగరంలో చేతన గ్లోబల్ ఫౌండేషన్‌కు అమెరికన్ తెలుగు అసోసియేషన్(ఆటా) అవార్డు లభించడంపై స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. బయ్యారం మండలం గంధంపల్లి గ్రామానికి చెందిన వెనిగళ్ల జగ్గాప్రసాద్‌రావు-సీతామహాలక్ష్మి దంపతుల కుమారుడు రవికుమార్ ఉన్నత విద్యనభ్యసించి అమెరికాలో స్థిరపడ్డాడు. 2016లో రవికుమార్ భార్య రేణుకతో పాటు పలువురు ఎన్ఆర్ఐల సహకారంతో చేతన గ్లోబల్ ఫౌండేషన్ స్థాపించి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ భారత్, అమెరికాతో సహ 7 దేశాల్లో చేతన గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా నిర్వాహకులు సేవా కార్యక్రమాలను విస్తరించారు. పేద ప్రజలు, విద్యార్థులు, వికలాంగులు, వృద్ధులకు తమవంతుగా సహాయపడేందుకు నిర్వాహకులు ఈ 8ఏళ్ల కాలంలో కోట్ల రూపాయలు వెచ్చించి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఈ క్రమంలోనే చేతన గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు నిర్విరామంగా 7 దేశాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన ఆట సంస్థ అవార్డుతో సత్కరించింది. అమెరికాలోని అట్లాంటా నగరంలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మకమైన 18వ ఆట (అమెరికా తెలుగు అసోసియేషన్) మహాసభల సందర్భంగా ఆదివారం ఆట అధ్యక్షుడు బొమ్మినేని మధు చేతుల మీదుగా చేతన గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెనిగళ్ల రవికుమార్ ఆట అవార్డు అందుకున్నారు. కాగా, విద్య, వైద్యం, మహిళా సాధికారిక, పర్యావరణంతో పాటు వివిధ రంగాల్లో తాము చేపడుతున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించినట్లు చేతన గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ గుర్తింపుతో తమపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. మున్ముందు మరిన్ని సేవా కార్యాక్రమాలను విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా పుట్టిన గడ్డ రుణం కొంతైనా తీర్చుకునే భాగ్యం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అంతేకాక చేతన గ్లోబల్ ఫౌండేషన్‌లో అంకితభావంతో పనిచేస్తూ తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి ఈ అవార్డు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోటవేటర్లో పడి బాలుడి మృతి

తండ్రి దుక్కి దున్నుతుడగా సరదగా ట్రాక్టర్ ఇంజిన్ ఎక్కిన బాలుడు

జారి పడటంతో ముక్కలైన శరీర భాగాలు

వరంగల్ జిల్లా లైన్‌తండాలో విషాదం



గుగులోతు బాలు (ఫైల్)



మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

నల్లబెల్లి, జూన్ 10 : ట్రాక్టర్ రోటవేటర్‌తో తండ్రి దుక్కి దున్నుతుండగా.. సరదాగా ట్రాక్టర్ ఇంజన్ పైకి ఎక్కిన కుమారుడు ప్రమాదవశాత్తు రోటవేటర్లో పడి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం లైన్‌తండాలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం... లైన్‌తండాకు చెందిన గుగులోతు మశోద, రాజులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. సోమవారం రాజు ట్రాక్టర్ ఇంజన్‌కు రోటవేటర్‌ను తగిలించుకొని తన భూమిలో దుక్కి దున్నుతున్నాడు. మధ్యాహ్నం చిన్న కుమారుడు గుగులోతు బాలు(9) రాగా, సరదాగా ట్రాక్టర్ ఇంజన్ పైకి బాలు ఎక్కాడు. దుక్కి దున్నుతున్న సమయంలో ట్రాక్టర్ కుదుపులకు బాలు రోటవేటర్లో పడిపోయాడు. వెంటనే ట్రాక్టర్‌ను ఆపినా, అప్పటికే శరీరం రెండు ముక్కలైంది. ఘటన స్థలికి చేరుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. బాలుడి తల్లి మశోద ఫిర్యాదు మేరకు ఎస్సై రామారావు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 10 :కేయూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కలిసి కేయూ పరిపాలన భవనాన్ని ముట్టడించారు. పరిపాలన భవనంలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆరోపించారు. సమస్యలపై విన్నివించినా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మజ్జిగ, పాలు, టీ సరిగా ఇవ్వడం లేదన్నారు. విద్యార్థులు మెస్ బిల్లులు నెలనెలా కడుతున్నప్పటికీ అధికారులు నాణ్యమైన భోజనం అందించడంలో విఫలమవుతున్నారన్నారు. వర్సిటీకి పూర్తి స్థాయి వీసీని నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కేయూ విద్యార్థులు శ్రీనాథ్, పృథ్వి, ప్రవళిక, అనూష, శిరీష, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



కేయూ పరిపాలన భవనంలో బైఠాయించి ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

'ఆయుర్వేదం'లో టెలిమెడిసిన్ సేవలు


వరంగల్‌లోని ప్రభుత్వ బోధనాసుపత్రి నుంచి అందుబాటులోకి

0870-2933553కు కాల్ చేస్తే వైద్య సలహాలు

ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సేవలు



ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి



టెలిమెడిసిన్ కేంద్రంలో రోగికి ఫోన్‌లో వైద్య చికిత్స సలహాలు ఇస్తున్న వైద్యుడు

గిర్మాజిపేట, జూన్ 10 : రోగుల సౌలభ్యం కోసం వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి ఇటీవల టెలిమెడిసిన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పక్షవాతం, అర్షమొలలు, వెరికోస్ వెయిన్స్, మోకాలు నొప్పులు, దీర్ఘకాలిక, మొండి రోగాలకు వైద్య చికిత్స అందిస్తోంది. మెరుగైన సేవలు అందుతుండడంతో రోగులు సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. కరోనా సమయంలో ఆస్పత్రులకు రాలేని రోగులకు ఫోన్ ద్వారా వైద్య సలహాలు అందించారు. ఇదే తరహాలు ఇకనుంచి నిత్యం ఫోన్‌లోనే సలహాలు, సూచనలు అందించేందుకు ఇటీవల ఆస్పత్రి సేవలను అందుబాటులోకి తెచ్చింది.

ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సేవలు..

ఆస్పత్రిలో టెలిమెడిసిన్ కోసం ప్రత్యేక చాంబర్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం, సెలవు రోజులు మినహా ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టెలిమెడిసిన్ అందుబాటులో ఉంటుంది ఆయుర్వేద వైద్య విభాగాలైన శల్య, శాలక్య, ప్రసూతి, స్త్రీరోగ, స్వస్థవృత్య, పంచకర్మ, కాయ చికిత్సలలో నిష్ణాతులైన వైద్యులు, వైద్య అధ్యాపకులు ప్రతి రోజు రోగులకు అందుబాటులో ఉంటూ టెలిమెడిసిన్ ద్వారా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. రోగి 0870- 2933553 టెలిమెడిసిన్ సెంటర్‌కు కాల్ చేయగానే ఆ రోజు సెంటర్‌లో డ్యూటీలో ఉన్న వైద్యుడు రిజిస్టర్‌లో రోగి పేరు, ఫోన్ నెంబర్ నమోదు చేసుకుని రోగికి వైద్య చికిత్స సలహాలు ఇస్తారు. అందుబాటులో ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరి ఉంటే అక్కడికి వెళ్లి ఉచితంగా మందులు తీసుకునే వెసులుబాటు కల్పిస్తారు. లేనిపక్షంలో ప్రయివేట్‌గా కొనుగోలు చేసుకోవచ్చు.

అన్ని రోగాలకూ సేవలు..

గ్యాస్ట్రిక్ ట్రబుల్, కీళ్ల నొప్పులు, తలనొప్పి, మైగ్రేన్, సైనసైటీస్, అర్షమొలలు, దీర్ఘకాళిక నడుము నొప్పులతో పాటుగా ఇన్‌ఫర్టిలిటీ, నిద్రలేమి సమస్యలపై టెలిమెడిసిన్‌కు కాల్ వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. సకాలంలో ఆహారం తీసుకోకపోవడం, వృత్తి, కుటుంబపరమైన మానసిక ఒత్తిడి, మారిన జీవన శైలి, రోజువారి శారీరక వ్యాయామం లేకపోవడం, ఫాస్ట్‌ఫుడ్స్ బ్రేవరేజ్ ఐటెమ్స్ తీసుకుంటున్న కారణాలతోనే ఆనారోగ్యా సమస్యలకు గురవుతున్నట్లుగా రోగుల కాల్స్‌తో తెలుస్తోందని వైద్యులు చెబుతున్నారు. వరంగల్ మహానగరంతో పాటుగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నిత్యం 10 నుంచి 20 కాల్ వస్తున్నాయని పేర్కొంటున్నారు.

నిష్ణాతులైన వైద్యులు..

వరంగల్ రైల్వే, ఆర్టీసీట బస్‌స్టేషన్‌లకు సమీపంలో ఉన్న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి నిత్యం 300 మంది అవుట్‌పేషంట్, వంద మంది ఇన్ పేషంట్‌లతో వైద్య సేవలు అందిస్తోంది. పక్షవాతం, కీళ్లనొప్పులు, మోకాలు నొప్పులు, వెరికొస్ వెయిన్స్ అర్షమొలలు, ఫిస్టిలా, వెన్నునొప్పులు, చెవి, ముక్కు, కన్ను, మధుమేహం, రక్తపోటు, స్త్రీ సంబంధిత, శిశు సంబంధిత రోగాలకు నిష్ణాతులైన వైద్యులు ఉచితంగా మెరుగైన వైద్య చికిత్సలు చేస్తుండటంతో ఆస్పత్రి నిత్యం రోగులతో కిటకిటలాడుతోంది. వరంగల్, కరీంనగర్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూడా రోగులు వస్తున్నారు.

టెలిమెడిసిన్‌ను వినియోగించుకోవాలి

డాక్టర్ పద్మావతి, సూపరింటెండెంట్



ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి రాలేని రోగుల కోసం టెలిమెడిసిన్ సేవలు అందిస్తున్నాం. రోగి అనారోగ్య పరిస్థితిని 0870-2933553 కాల్ చేసి చెబితే వైద్యులు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారు. సమీప ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీకి రిఫర్ చేస్తూ ఉచితంగా మందులు ఇప్పిస్తున్నాం. ఆస్పత్రిలో వైద్య చికిత్స చేయించాల్సిన పరిస్థితి ఉంటే వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి రావాల్సిందిగా సూచిస్తున్నాం. ఈ అవకాశాన్ని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

ఇసుకను తరలిస్తే ఉద్యమిస్తాం: బీఆర్ఎస్

దేవరుప్పుల, జూన్ 10: దేవరుప్పుల మండలం నుంచి ఇసుకను తరలిస్తే అందుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రామ్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం దేవరుప్పులలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో స్థానిక అవసరాలకు మినహా ఇతర మండలాలలో రిజర్వాయర్లకు ఇసుక తరలిస్తే ఊరుకునేది లేదని అన్నారు. వందలాది మంది రైతుల పొట్ట కొడితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, రైతులకు నష్టం జరిగే పని ఏదైనా ఉపేక్షించబోమని అన్నారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెక్‌డ్యాంలు నిర్మించిందని గుర్తు చేశారు. అధికారులు డబ్బులకు ఆశ పడి, ఒత్తిడిలకు లోనై అనవసరంగా అనుమతులు ఇస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి: కలెక్టర్

జనగామ కల్చరల్, జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బడిబాటపై రాసి, పాడిన పాటను అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేశ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. గానుగుపహాడ్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు రవీందర్, యశ్వంతాపురం ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు వసంత కలిసి పాటను పాడి రికార్డింగ్ చేయించారని డీఈవో కె.రాము కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందిస్తూ ప్రతీ గ్రామంలో ఈ పాట వినిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాస్, జీసీడీవో గౌసియాబేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతు పనుల పరిశీలన

జనగామ కల్చరల్, జూన్ 10: జనగామ మండలం చంపక్‌హిల్స్‌లోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ తీగ మార్పు పనులను ఎస్ఈ వేణుమాధవ్ సోమవారం పరిశీలించారు. సబ్‌స్టేషన్ ప్రారంభం సందర్భంగా 2016లో వేసిన తీగల స్థానంలో ప్రస్తుతం అధిక లోడును ఆపేలా కొత్త తీగలు వేస్తున్నారు. ఆ పనులను డీఈఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఏడీఈ వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు.

వావిలాల, వల్మిడి గ్రామాల్లో బడిబాట



వల్మిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు, ఉపాధ్యాయులు

పాలకుర్తి, జూన్ 10 : మండలంలోని వావిలాల, వల్మిడి గ్రామాల్లో సోమవారం బడిబాట సందర్భంగా గ్రామస్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య మాట్లాడుతూ సర్కార్ బడిలోనే నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని అన్నారు. బడి వయసున్న బాలలు బడిలో ఉండాలని ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని తలపెట్టిందని అన్నారు. పాఠశాలలో చేరిన ప్రతీ విద్యార్థికి రెండు జతల దుస్తులు, ఉచిత పుస్తకాలు, నోటు పుస్తకాలను అందచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు సరిత, హరిత, తిరుమలదేవి, హరిప్రియ, సోంమల్లయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను కలిసిన కొమ్మూరి

జనగామ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన మల్లన్నను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. తన గెలుపునకు సహకరించినందున కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మల్లన్న ధన్యవాదాలు తెలిపారు. ప్రతాప్‌రెడ్డి వెంట ఆయన కుమారుడు రాకేశ్‌రెడ్డి ఉన్నారు.


మల్లన్నను అభినందిస్తున్న ప్రతాప్‌రెడ్డి

విధులకు గైర్హాజరైన వారిని ఉపేక్షించం

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీష్‌రాజ్

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 10: సమయానికి విధులకు హాజరుకాని వైద్య సిబ్బందిపై శాఖపరమైన చర్యలు ఉంటాయని జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీష్ రాజ్ హెచ్చరించారు. ఘన్‌పూర్ పీహెచ్‌సీని ఎమ్మెల్యే కడియం సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని పీహెచ్‌సీకి వచ్చి సిబ్బంది గైర్హాజరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గతంలో కూడా పీహెచ్‌సీని తనిఖీ చేశామని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేస్తామని అన్నారు. ప్రసవాల సంఖ్య పెంచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో ఆసుపత్రికి రావాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని అన్నారు. అనంతరం ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్, డాక్టర్ జనార్ధన్, డాక్టర్ ప్రసన్న కృష్ణ, సీహెచ్‌వో సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీ వద్ద మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హరీష్‌రాజ్

కబ్జాదారుల నుంచి భూమిని కాపాడాలి


భూములకు సంబంధించిన పత్రాలతో ఆందోళన చేస్తున్న రైతులు

రఘునాథపల్లి, జూన్ 10: కబ్జాదారుల నుంచి తమ భూములను కాపాడాలని కోరుతూ రైతులు ఆందోళనకు దిగారు. రఘునాథపల్లి మండలం రామన్నగూడెం గ్రామంలో రైతులు వాకిటి వెంకటన్న, గున్నాల సోమయ్య, వాకిటి నర్సయ్య సోమవారం మాట్లాడుతూ కోడూరు రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబరు 181లో గల 10.30 ఎకరాల వ్యవసాయ భూమిని 13 కుటుంబాలకు చెందిన తమ తాతలు, తండ్రులు సుమారు 70 సంవత్సరాల క్రితమే కోడూరు గ్రామానికి చెందిన గడ్డం నర్సింహారెడ్డి వద్ద కొనుగోలు చేశారని, అప్పటి నుంచి ఆ భూములను తాము సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని అన్నారు. ఇటీవల కొందరు కబ్జాదారులు ఎలాంటి ఆధారాలు లేకుండా తాము గడ్డం నర్సింహారెడ్డి వారసులమంటూ వచ్చి తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

జఫర్‌గడ్, జూన్ 10 : ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేయడం, మంత్రులుగా రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు నియమితులైన సందర్భంగా ఆదివారం రాత్రి జఫర్‌గడ్ మండల కేంద్రంతో పాటు మండలంలోని కూనూరు, ఉప్పుగల్లు, తమ్మడపల్లి(ఐ), తిమ్మంపేట, కోనాయిచలం గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా డీజే సౌండ్ సిస్టం పాటలతో నృత్యాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జెండాలు చేబూని.. పార్టీకి, మోదీకి జైకొడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్థానిక సెంటర్ వద్ద బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో కేంద్రంలో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడంతో పాటు మోదీ మూడో సారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం హర్షణీయమన్నారు. బీజేపీ పాలనలోనే దేశ ప్రగతి, ప్రజా సంక్షేమం సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు గాదెపాక చిరంజీవి, తిరుపతి, సింగారపు రమేశ్, నేరెళ్ల రమేశ్, ఇల్లందుల సారయ్య, గాదెపాక శ్రీను, శ్వేత, రడపాక యాకలక్ష్మీ, సాయిరాం, మారెపల్లి రవి, మదన్‌మోహన్, పవన్‌కుమార్, చంద్రమౌళి, పిట్ట రాజు, గొలుసు లింగన్న, దరంసోత్ నరేశ్, వీరన్న, తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జఫర్‌గడ్‌లో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు

చిలుపూర్, జూన్ 10: మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వివిధ గ్రామాలకు చెందిన రైతులతో పాటు, సీపీఎం పార్టీ కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని నాయబ్ తహసీల్దార్ (డీటీ) విమలకు అందజేశారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ, ధరణిలో దొర్లిన తప్పుల కారణంగా భూ సంబంధిత సమస్యలకు చెందిన ఆర్జీలు గత రెండేళ్ళుగా పరిష్కారానికి నోచుకోలేదని, తద్వారా రైతు కుటుంబాల్లో గొడవలు తలెత్తుతున్నాయని, డీఎస్ (డిజిటల్ సైన్) సమస్యలు సైతం పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పహాణి, పొజిషన్, కులం, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం కార్యాలయానికి వచ్చే రైతులు, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన సీపీఎం నాయకులపై కక్షసాధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీపీఎం పార్టీ మండల కార్యదర్శి సాదం రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో పోలు సంపత్, అపరాధపు రాజు, గుంటి భీముడు, మహేశ్, చిన్న ఐలయ్య, నలిమెల శంకర్, సమ్మయ్య, సుంక రాజు, సాదం రాజు, మల్లయ్య, రవి, గోలి శంకర్, రాజు, గట్టయ్య పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకుల ధర్నా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


కైసర్ పాషా (ఫైల్)

రఘునాథపల్లి, జూన్ 10: మోటారు సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోవడంతో ఓ యువకుడు తీవ్ర గాయాలతో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన మహ్మద్ కైసర్ పాషా (35) రఘునాథపల్లి మండల కేంద్రంలోని బంధువుల ఇంట్లో జరిగిన వేడుకకు హాజరై తిరిగి వెళ్తున్న క్రమంలో నిడిగొండ బ్రిడ్జిపై మోటారు సైకిల్ అదుపు తప్పడంతో కింద పడిపోయాడు. ఘటనలో మహ్మద్ కైసర్ పాషా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. ఆయన భార్య సోనీ, కుమారుడు సోయబ్, కుమార్తె షిరిన్ ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం


శ్రీమన్నారయణపురంలో వర్షం కురువాలని కోరుతూ కప్పతల్లి ఆట ఆడుతున్న మహిళలు

రఘునాథపల్లి, జూన్ 10: పల్లెలు పచ్చని పంటలతో కళకళలాడాలని, సమృద్ధిగా వర్షాలు కురువాలని కోరుతూ శ్రీమన్నారయణపురంలో మహిళలు సోమవారం గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. అనంతరం కప్పతల్లి ఆట ఆడి దేవతలకు మొక్కులు సమర్పించి విరివిగా వర్షాలు పడాలని దేవతలను వేడుకున్నారు. కప్పతల్లి ఆటలో మహిళలతో పాటు చిన్నారులు పాల్గొన్నారు.

'మిషన్' వివరాలు సేకరించాలి

కొడకండ్ల, జూన్ 10: ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ వివరాలు సేకరించాలని ఎంపీడీవో నాగ శేషాద్రి సూరి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ భగీరథ యాప్‌పై పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు, అంగన్వాడీ టీచర్లకు, సీనియర్ మేట్‌లకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్ళి యజమానితో మాట్లాడి యజమాని ఫోటో, భగీరథ నల్లా ఫోటోలు యాప్‌లో ఎలా తీసుకోవాలో ఏవిధంగా వివరాలు పొందుపరచాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇందిర, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్ ఇవ్వాలి


పాలకుర్తిలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

పాలకుర్తి, జూన్ 10 : తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ పథకం ద్వారా నల్లా కనెక్షన్ ఉండేలా సర్వే చేయాలని జడ్పీ సీఈవో అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో తాగునీటి సమస్య ఉండకూడదని, అందుకోసం పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, ఉద్యోగులు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా ప్రజా ప్రతినిధులు నల్లాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పాలకుర్తి, కొడకండ్ల ఎంపీడీవో రాములు, నాగేశేషాద్రిసూరి ఉన్నారు.

ఎమ్మెల్యే కడియం పరామర్శ

చిలుపూర్, జూన్ 10 : మండలంలోని చిన్నపెండ్యాలలో అనారోగ్యం కారణంగా మృతిచెందిన మేరుగు నర్సయ్య (72) కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సందర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో పాటు, అతని అల్లుడు, చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ డైరెక్టర్ గజ్జెల దామోదర్‌ను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఆయన వెంట ఎంపీటీసీ తాళ్ళపల్లి ఉమ సమ్మయ్య, మాజీ సర్పంచులు లింగారెడ్డి, సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ తాళ్ళపల్లి సంపత్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి, భూక్య రమేష్‌నాయక్, బొమ్మిశెట్టి బాలరాజు, నాయకులు గడ్డమీది వెంకటస్వామి, మామిడాల యాదవరెడ్డి, ఇల్లందుల హరిబాబు, తాళ్ళపల్లి రాజ్‌కుమార్, వెంకన్న, రఘు తదితరులు పాల్గొన్నారు.


చిన్నపెండ్యాలలో మేరుగు నర్సయ్యకు నివాళి అర్పిస్తున్న కడియం

కలెక్టరేట్‌కు తరలిన భవన నిర్మాణ కార్మికులు


జఫర్‌గడ్ నుంచి బైక్ ర్యాలీగా తరలి వెళుతున్న కార్మికులు

జఫర్‌గడ్, జూన్ 10: చలో కలెక్టరేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు జఫర్‌గడ్ మండలం నుంచి భవన నిర్మాణ కార్మికులు సోమవారం తరలి వెళ్లారు. వారి సమస్యలపై సంఘం రాష్ట్ర కమిటీ కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాయిని రామస్వామి, జిల్లా ప్రచార కార్యదర్శి పినింటి నర్సింహరాములు, మండల అధ్యక్షుడు సముద్రాల ఎల్లయ్య, టౌన్ అధ్యక్షుడు శోభన్‌బాబు నేతృత్వంలో కార్మికులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మండల కేంద్రంలోని సెంటర్ నుంచి బైక్ ర్యాలీ చేపడుతూ జిల్లా కేంద్రానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కార్మికులు నినాదాలు చేశారు. సంఘం జిల్లా ప్రతినిధులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంత వరకు సంఘటితంగా పోరాటం చేస్తామన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

వేలేరు(ధర్మసాగర్), జూన్ 10: ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో సోమవారం నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మహిళల కోసం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి, ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడం జరిగిదన్నారు. వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామం నుంచి హనుమకొండ వరకు సర్వీస్ సేవలు కొనసాగించడం జరుగుతుందన్నారు. గ్రామంలో చదువుకునే యువతీయువకుల కోరిక మేరకు కొత్తపల్లి మార్గం నుంచి హనుమకొండకు 40 కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ బస్సు రాకపోకలు ఎర్రబెల్లి గ్రామస్తుల కోసం కొనసాగించడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ ద్వారా తెలంగాణ ప్రజలకు మరిన్ని సేవలను అందించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం వసంత, డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పెద్ది వెంకట్ నారాయణ, తహసీల్దార్ కొమి తదితరులు పాల్గొన్నారు.


ఎర్రబెల్లిలో నూతన బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మడికొండ, జూన్ 10: మడికొండలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం మడికొండకు చెందిన బోగి యాదగిరి భార్యను తీసుకొని బైక్‌పై ధర్మసాగర్ వైపుకు వెళ్తున్నాడు. పెద్దమ్మ గుడి వద్దకు రాగానే తమ బైక్‌పై గొర్రెను తీసుకొని మడికొండలోని ఆస్పత్రికి తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులు వేగంగా వచ్చి వీరి బైక్‌ను ఎదురుగా ఢీకొట్టారు. ప్రమాదంలో భార్యాభర్తలు కిందపడిపోగా ఇద్దరి కాళ్లకు గాయాలైనాయి. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు.

అదేవిధంగా మడికొండ శివారులోని ధర్మసాగర్ రోడ్డులో గల పెట్రోల్ పంప్ వద్ద జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు ధర్మసాగర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన కోళ్ల రాజు ఆయన మేనల్లుళ్ల స్కూల్ అడ్మిషన్ కోసం మడికొండలోని ఓ ప్రైవేటు స్కూల్ కు వెళ్లి వివరాలు కనుక్కొని తన ఇద్దరు అల్లుళ్లను తీసుకొని వారి గ్రామమైన ధర్మసాగర్ మండలం క్యాతంపల్లికి వెళ్తున్నాడు. మడికొండ పెట్రోల్ పంపు ముందుకు రాగానే వెనకాలే వచ్చిన టిప్పర్ లారీ వెనకాల నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో రాజు తలకు గాయాలయ్యాయి. కాలు నుజ్జునుజ్జయింది. టిప్పర్ లారీ డ్రైవర్ పరారయ్యాడు. రాజు అల్లుళ్లకు స్వల్ప గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రెండోరోజూ కొనసాగిన నాటక పోటీలు

వరంగల్ కల్చరల్, జూన్ 10: ఉభయ రాష్ట్రాల స్థాయి ఆహ్వాన తెలుగు నాటక పోటీలు పోతన విజ్ఞాన పీఠంలో సోమవారం రెండో రోజుకు చేరాయి. ముఖ్యఅతిథి సదానందం, విశిష్ఠ అతిథి బి.సత్యనారాయణ, ఆర్. షణ్ముఖ చారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సదానందం మాట్లాడుతూ హనుమకొండలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాళోజీ కళా క్షేత్రంలో నాటక కళాకారులకు అనువైన విధంగా నిర్మించాలని, రిహార్సల కోసం ప్రత్యేక హాల్ కేటాయించాలన్నారు. రెండో రోజు జరిగిన నాటకలో సంక్షేమ సమాఖ్య పాలకొల్లువారిచే టి.వెంకటేశ్వర్‌రావు రచనతో అన్యూహం నాటకం ప్రదర్శించారు. తల్లిదండ్రుల కష్టార్జితాన్ని కొడుకులు వారసత్వ హక్కు పేరుతో లాక్కోవడం, వారి కష్టాలు, కన్నీళ్లను ఈ నాటిక ద్వారా కళ్లకు కట్టారు. రెండో నాటిక కాకతీయ కళా సమితి హుజురాబాద్ వారి 'వీలునామా' ప్రదర్శించారు.

నేటి సమాజంలో ఆత్మరక్షణ విద్య అవసరం

మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

జనగామ కల్చరల్, జూన్ 10: నేటి సమాజంలో ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరమని మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్స్‌లో మాస్టర్ ఓరుగంటి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో విద్యతో పాటు ఆత్మరక్షణకు కరాటే లాంటి విద్య అవసరమన్నారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శేషాద్రి, ఇర్రి మల్లారెడ్డి, తాటి కుమార్, కార్తీక్, రాజు, అక్షిత్, మణివర్ధన్, ప్రణయ్, చంద్రహాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


బాల్య స్నేహితురాలికి ఆర్థిక సహాయం అందిస్తున్న మిత్రులు

నర్మెట, జూన్ 10: నర్మెటలో సోమవారం 1998-99 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. అయితే తమతో కలిసి చదువుకున్న గొడుగు కవిత భర్త ఇటీవల మృతిచెందగా విషయం తెలుసుకున్న స్నేహితులు వెంటనే తలా కొన్ని డబ్బులు వసూలు చేసి రూ.25 వేలు ఆమెకు అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చిర్ర మహిపాల్‌రెడ్డి, బానోతు శ్రీనివాస్, ప్రజ్ఞాపురం రమేష్, గుర్రాల కరుణాకర్, గోపగోని నరేష్, ప్రజ్ఞాపురం మల్లేష్, ఆనందాసు రవి, గంగం సంతోష్, తిరుపతి, ఉస్మాన్, చంద్రకళ, శ్రీలత, పద్మ, సింధూజ తదితరులు ఉన్నారు.